సిసి కెమెరాల ఏర్పాటుకు అందరూ సహకరించాలి : సిఐ

తొగుట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :
పోలీసు ఉద్యోగ మిత్ర కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువత ఉద్యోగమిత్ర క్యూఆర్ కోడ్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీసు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలీస్ ఉద్యోగ మిత్ర జాబ్ మేళా మన పోలీసు మన ఊరు సిద్దిపేట నిఘా నేత్ర కార్యక్రమాలపై శుక్రవారం తొగుట పిఎస్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తొగుట సీఐ లతీఫ్ మాట్లాడుతూ సిద్దిపేట పోలీసు నిఘా నేత్ర కార్యక్రమాలలో భాగంగా ప్రతి గ్రామంలో సీసీ టీవి కెమెరాలు ఏర్పాటుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. గ్రామాలలో యువత మద్యానికి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విపిఓలు గ్రామంలో సీసీటివి కెమెరాల ఏర్పాటుకు గ్రామంలోని ప్రజలను భాగస్వాములు చేయాలని ప్రతి విపిఓ గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలతో సన్నిహిత సంబంధం కలిగి ఉండాలన్నారు.కార్యక్రమంలో ఎస్ఐ రవికాంత్, మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

ప్రభుత్వ ఆసుపత్రులలో మతపరమైన కార్యక్రమాలు వద్దు

బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :
పటాన్‌చెరు పట్టణంలోని నూతనంగా నిర్మించిన గవర్నమెంట్ హాస్పిటల్ లో శుక్రవారం రంజాన్ ఇఫ్తార్ విన్ నిర్వహిస్తున్నారని తెలిసి సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్యూర్ రాజశేఖర్ రెడ్డి, బైండ్ల కుమార్, ఇతర నాయకులు, కార్యకర్తలతో వెళ్లి సందర్శించారు. గోదావరి అంజిరెడ్డి హాస్పటల్ సిబ్బందిని ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెబుతున్నారని తెలిపారు. హాస్పిటల్ డాక్టర్లు, నర్సులు బోనాలు, బతుకమ్మలను ముడిపెడుతూ మాట్లాడిన ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, కచ్చితంగా ఇలాంటి కార్యక్రమాలు జరగకూడదని హాస్పిటల్ సిబ్బందిని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మతపరమైన ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు నాయకులు ప్రసాద్, శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్య శిబిరంను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

ఆయుష్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
ప్రభుత్వ సమీకృత ఆయుష్ వైద్యశాలలో ఆయుర్వేదిక్, యునాని, హోమియోపతి వైద్య సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో గల ప్రభుత్వ సమీకృత ఆయుష్ మెగా వైద్య శిబిరాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఒక్కో వారం ఒక్కో థీమ్‌తో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఈ వారం హెల్త్ వీక్‌కి కేటాయించిన సందర్భంగా ఆయుష్ వైద్య శాలలో ఉచిత ఆయుష్ మెగా వైద్య శిబిరం ద్వారా ప్రజలకు ఆయుర్వేదిక్, యునాని, హోమియోపతి వైద్యసేవలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆయుష్ వైద్యశాలలో ఆయుర్వేదిక్, యునాని, హోమియోపతి సేవలను చికిత్స,ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. 50 పడకల ఆసుపత్రిలో 24/7 ఓపిసేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వృద్దులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి ఈ ఆయుష్ కేంద్రంలో వైద్యం చేయించుకుంటే తప్పకుండా నయమవుతుందన్నారు. వైద్య శాలలో మెడిసిన్ ప్రకృతిలో దొరికే మూలికలతో తయారు చేస్తారని వైద్యం చేయించుకొని మందులు వాడితే ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. ఆయుష్ వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంజుల, ఆయుష్ ఆసుపత్రి సూపరిండెంట్ ఉమాదేవి, వైద్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

జంగరాయిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న నగేష్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10,ప్రభాతవార్త: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంచేయాలని మెదక్‌జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల పరిధి గవలపల్లిలోని ఎరువుల దుకాణాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జంగరాయి గ్రామంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వపాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని చెప్పారు. విద్యార్థులు రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో దామోదర్, హౌసింగ్ పీడీ మాణిక్యం, హౌసింగ్ ఏఈ లోకేష్, సర్పంచులు ఆవుల గోపాల్ రెడ్డి, సిద్ధిరాములు, ఆర్ఐ రాజు తదితరులు ఉన్నారు.

బెల్ట్ షాపుల నిషేధిస్తూ గ్రామసభ తీర్మానం...

పాపన్నపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మండల పరిధిలోని నార్సింగిలో బెల్ట్‌షాపులను నిషేదిస్తు, శుక్రవారం గ్రామ పంచాయతి సభ్యులు తీర్మానం చేసినట్లు సర్పంచ్ దారబోయిన మల్లేశం తెలిపారు.గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తు,బెల్టుషాపులు నడువుతున్నందున వాటిని, నిషేదిస్తు పంచాయతీ సభ్యులు ఏకగ్రీవ తీర్మాణం చేసినట్లు చెప్పారు. ఇక మీదట గ్రామంలో ఎవరు అక్రమంగా మద్యం అమ్మవద్దని తెలిపారు.

ఇక్రిసాట్ ఫెన్సింగ్ ఏరియాను పరిశీలించిన కలెక్టర్

రామచంద్రాపురం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:
భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఇక్రిసాట్ ఫెన్సింగ్ ఏరియా కాలనీని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు కూల్చి అపార్ట్‌మెంట్లు నిర్మించే ప్రతిపాదనపై కాలనీ ప్రజల అభిప్రాయలను జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీఓ 58, 59ల ద్వార తమ ఇండ్లకు రెగ్యూలరైజేషన్ పట్టాలు పొందామని గుర్తు చేశారు. ప్రతి ఇంటిని కూల్చి అపార్ట్‌మెంట్ ఏర్పాటుకు తాము వ్యతిరేకమని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.
తామున్న ఇండ్లకే మరో5 లక్షలు మంజూరు చేస్తే ఇంటిని మరింతగా అభివృద్ది చేసుకుంటామన్నారు. 2017లో రైల్వే లైన్ విస్తరణలో భాగంగా 221 ఇండ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూంలు ఇస్తామని హామి చేసినా నేటి వరకు డబుల్ బెడ్‌రూంల జాడ కానరావడం లేదని ఆదర్శ్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. 221 ఇండ్లు కోల్పోయిన వారికి డబ్బుల్ బెడ్ రూంలు మంజూరు చేసి పేదలకు న్యాయం చేయాలని ఆదర్శ్‌రెడ్డి వినతి చేశారు. పేదల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చిస్తామని కలెక్టర్ హామి చేశారు.


ఇక్రిసాట్ ఫెన్సింగ్ ఏరియాను పరిశీలిస్తున్న కలెక్టర్, ఆదర్శ్‌రెడ్డి

ఉన్నత లక్ష్యాలే విజయానికి తొలి అడుగు

- * 9, 12 తరగతులే జీవితానికి కీలకం
- * నీట్, జేఈఈ, ఎంసెట్‌కు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి
- * సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

పటాన్‌చెరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :
విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్ తర్వాత ఉండే పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలని సూచించారు. విద్యార్థి జీవితంలో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అత్యంత కీలక దశగా పేర్కొన్నారు. ఈ సమయంలో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా నీట్, జేఈఈ అడ్వాన్స్‌డు ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ అందిస్తుందని చెప్పారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతిష్టాత్మక కళాశాలల్లో సీట్లు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. జీవితంలో ఎదురయ్యే అవాంతరాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని, కష్టపడే వారికి విజయమే ప్రతిఫలమని కలెక్టర్ పేర్కొన్నారు. చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ ఎంతో అవసరమని ఆమె వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులు, స్టోర్ రూమ్, వంటగదిని పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసినచపాతీ మేకింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భనలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కామధేను ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థినిలు

మెదక్ నర్సింగ్ విద్యార్థినుల భారీ నిరసన

మెదక్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : పట్టణంలోని పిల్లికోటల నర్సింగ్ కాలేజ్ హాస్టల్‌లో నెలకొన్న పరిస్థితులకు వ్యతిరేకంగా విద్యార్థినులు కదం తొక్కారు. 120 మంది విద్యార్థినులు ఉన్న ఈ హాస్టల్‌లో కనీస సౌకర్యాలు లేక, అధికారుల నిర్లక్ష్యం తోడవ్వడంతో మండుటెండలో మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తూ కలెక్టరేట్ వరకు వచ్చి నిరసన తెలియజేశారు.

వసతుల లేమి.. వేధింపులు

హాస్టల్‌లో 120 మందికి కేవలం ఒకే ఒక బాత్‌రూమ్ ఉండటం అక్కడి దుస్థితికి అద్దం పడుతోంది. నీటి ట్యాంకులు పాచి పట్టి అపరిశుభ్రంగా ఉండటమే కాకుండా, కుళ్లిన కూరగాయలతో నాణ్యత లేని భోజనం పెడుతున్నారని విద్యార్థినులు ఆరోపించారు. పరిసరాల్లో వెలుతురు లేక పాములు వస్తున్నాయని, కనీసం కరెంటు సదుపాయం కూడా సరిగ్గా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెయింటెనెన్స్ పేరుతో ప్రతి విద్యార్థి నుండి రూ. 3500 వసూలు చేస్తున్నారని, సమస్యలను ప్రశ్నిస్తే ప్రిన్సిపాల్ దుర్భాషలాడుతూ వేధిస్తున్నారని బాధితులు పేర్కొన్నారు.

అధికారుల విచారణ.. రాజకీయ మద్దతు

విద్యార్థినుల ఆందోళనతో స్పందించిన ప్రభుత్వం, విచారణ కోసం ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి మాధవిని నియమించింది. ఆమె హాస్టల్ గదులను, కిచెన్‌ను తనిఖీ చేసి పరిస్థితిని సమీక్షించారు. ఈ నిరసనకు బీజేవైఎం, బీజేపీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. త్వరలోనే కలెక్టరుకు పూర్తి స్థాయి నివేదిక అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

రైతులు మొబైల్ నెంబర్‌ను అప్‌డేట్ చేసుకోవాలి : ఎవో

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): రైతులు పట్టా పాస్‌బుక్‌కు అనుసంధానానికి గతంలో ఇచ్చిన మొబైల్ నెంబర్లు వాడనట్లయితే ప్రస్తుతం వాడుతున్న మొబైల్ నెంబర్లను అప్‌డేట్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వసంతరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎరువుల సరఫరాలో పారదర్శకత పెంచేందుకు రైతు మొబైల్ నెంబర్ ఆధారంగా యూరియా బుకింగ్ యాప్‌ను అమలు చేస్తుందని, ఇటీవల చాలామంది రైతులు తమ మొబైల్ నెంబర్లను మార్పు చేసుకున్న కారణంగా యూరియా బుకింగ్ యాప్‌లో నమోదుచేసిన పాత నెంబర్ల వల్ల యూరియా బుకింగ్‌కాకఇబ్బందులు ఎదుర్కున్నారని, ప్రస్తుతం రైతులు వారు వాడుతున్న సరైన మొబైల్ నెంబర్లను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. మొబైల్ నెంబర్ మార్పు కొరకు సమీప రైతు వేదికలో వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ యూరియా బుకింగ్ యాప్‌లో కొత్త మొబైల్ నెంబర్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులందరూ ఈనెల 20వ తేదీలోపు వినియోగించుకోవాలన్నారు.

నోటీసులు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

అనుమతులు లేని నిర్మాణానికి నోటీసులు జారీ

హత్నూర ఏప్రిల్ 10, ప్రభాతవార్త : అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్న హత్నూర మండలం కాసాల గ్రామంలోని బ్లూ లియో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యానికి శుక్రవారం నోటీసులు జారీ చేశామని పంచాయతీ కార్యదర్శి స్వప్న తెలిపారు పరిశ్రమ నిర్మాణానికి పంచాయతీ తీర్మానాలు, అనుమతులు లేవని గ్రామ ప్రజలు ఆరోపణలు చేస్తూ సంగారెడ్డి జిల్లా ప్రజావాణిలో పరిశ్రమపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశ్రమ యాజమాన్యానికి నోటీసులు జారీచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుండి పూర్తిస్థాయి అనుమతులు పొందిన తర్వాతనే నిర్మాణ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

ప్రజాప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలి

ఎంపిడివో ఎం.హుస్సేన్

నర్సాపూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యంగా నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వార్డు సభ్యుల రెండో విడత శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఐదు రోజుల పాటు సాగిన ఈ శిక్షణలో మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు చెందిన నూతన వార్డుసభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు వేడుకలో ఎంపీడీఓ మహమ్మద్ మొఅజ్జమ్ హుస్సేన్ పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, వార్డు సభ్యులు సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే గ్రామ వికాసం సాధ్యమని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ చట్టాలు, ప్రభుత్వ నిధుల వినియోగంపై పట్టు సాధించి, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేయాలని పిలుపునిచ్చారు.గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రామ్ మనోహర్, ఏపీవో అంజిరెడ్డి, టీఓటీలు లక్ష్మణ్, శంకర్, ప్రభాకర్, శ్రీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడివో హుస్సేన్

పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న దృశ్యం

రాయపోల్ రైస్‌మిల్ తనిఖీ

1100 క్వింటాళ్ల పిడిఎస్(సన్నబియ్యం) స్వాధీనం

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/రాయపోల్, ఏప్రిల్ 10,ప్రభాతవార్త :
సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని రామారం గ్రామంలోని శ్రీసాయి మహాదేవ్ రైస్ మిల్లుపై పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి జి.తనూజ నేతృత్వంలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి 1100 క్వింటాళ్ల పిడిఎస్(పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) సన్న బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. తనిఖీ చేస్తున్న సమయంలో ఒక వాహనం రైస్ మిల్ ప్రాంగణంలోకి ప్రవేశిస్తుండగా అదుపులోకి తీసుకొని పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి జి.తనూజ తెలిపారు. వాహనం డ్రైవర్‌ను విచారించగా బచ్చు తర్నాకర్‌కు చెందిన బియ్యం అమ్మకానికి ఈ రైస్‌మిల్‌కు తరలించాడని తెలిపినట్లు తెలిపారు. బచ్చు రత్నాకర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సంబంధిత రైస్ మిల్లర్‌పై గతంలో సైతం పిడిఎస్ బియ్యం మళ్లింపు కేసుల్లో, ఇతర క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. రైస్‌మిల్‌ను గతంలో ధాన్యం కొనుగోలు (ప్రొక్యూర్‌మెంట్) కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీ కార్యకాలాపాల నుంచి బ్లాక్ లిస్ట్ చేయడం జరిగిందన్నారు. పంచనామా నిర్వహించి పిడిఎస్ బియ్యం 1100 క్వింటాళ్లను స్వాధీనం చేసుకొని భద్రపరించేందుకు తొగుట,మిరుదొడ్డి ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించినట్లు తెలిపారు. ఘటనపై రాయపోల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ పిడిఎస్ కంట్రోల్ ఆర్డర్ 2016, తెలంగాణ కస్టమ్ మిల్లింగ్ ఆర్డర్ 2015 ఉల్లంఘనల కింద చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం : చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

రాయపోల్, ఏప్రిల్ 10(ప్రభాతవార్త): పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో సరస్వతి రాములకు చెందిన ఇందిరమ్మ ఇంటిని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేయడంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టంచేశారు. అంతకుముందు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, రైతులకు రైతుభరోసా, పేదలకు గృహ నిర్మాణం, యువతకు ఉద్యోగ అవకాశాలకల్పన వంటి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎక్కాల శ్యామల మల్లేశం, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిఎం చిత్రపటాన్ని అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వర్గల్, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): అప్పులబాధ, ఆరోగ్యం సహకరించకపోవడంతో ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని రామక్కపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం... రామక్కపేట్ గ్రామానికి చెందిన బొమ్మ కుమార్(50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా ఇటీవల కొత్తగా ఇల్లు కట్టుకోవడం కోసం అప్పులు చేయడం జరిగింది. అతను వెన్నెముక నొప్పితో ఏ పని చేయకుండా ఉంటున్నాడు. అప్పులు తీర్చే మార్గంలేక, వెన్నెముక నొప్పి భరించలేక గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు బొమ్మ వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 10(ప్రభాతవార్త): మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.30వేల జరిమానా విధించడం జరిగిందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్, క్యాసారం ఎక్స్‌రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్‌పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలలో గత కొన్ని రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని తెలిపారు. అట్టి వ్యక్తులను శుక్రవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ జరిపి ముగ్గురికి రూ.30వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరికి రూ.10వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మురళి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు మద్యం తాగి వాహనాలు నడిపేవారిని కట్టడి చేయడానికి, ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

జూదం ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు

రూ. 3485 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం

పాపన్నపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : బొమ్మ బొరుసు ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పాపన్న పేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సంచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.శుక్రవారం పొడ్చెన్ పల్లి శివారులో కొందరు బొమ్మ బొరుసుఆడుతున్నట్లువిశ్వసనీయ సమాచారం మేరకు పాపన్న పేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తమసిబ్బందితోతనిఖీలు నిర్వహించగా, కొంతమంది వ్యక్తులు బొమ్మ బొరుసు జూదం ఆడుతున్నట్లు గుర్తించి వెంటనే వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 3 వేలనాలుగు వందల ఎనభైఐదు రూపాయల నగదుతోపాటు 6మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు .ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బొమ్మ బొరుసు, జూదాలకు పాల్పడితే చట్టపరమైనచర్యలుతప్పవని హెచ్చరించారు. జూదం కారణంగా కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు సమాజంలో చెడు ప్రభావం పడుతుందని తెలిపారు. మండలంలో ఎక్కడైనా జూదంఆడినా, జూదం నిర్వహించినా వెంటనే పాపన్న పేట పోలీసులకు సంచారం అందించాలని ప్రజలను కోరారు.

అంతర్ రాష్ట్ర కాపర్ వైర్ దొంగ అరెస్ట్

నిందితుడి నుంచి రూ.6,70,000 నగదు, 3 బైక్‌లు, ఫోన్లు, 1,415 కిలోల కాపర్ వైర్ స్వాధీనం.. సీపీ సాధన రష్మీ పెరుమాళ్

వివరాలను వెల్లడిస్తున్న సీపీ సాధన రష్మీ పెరుమాళ్

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :
మద్యానికి బానిసై తాను చేసే పనితో డబ్బులు సరిపడకపోవడంతో ఎలాగైనా ఎక్కువ డబ్బులు సులభంగా సంపాదించాలని నిర్ణయించుకొని ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైర్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు సీపీ సాధన రష్మీ పెరుమాళ్ తెలిపారు. సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నందులాల్ అలియాస్ మధులాల్ బతుకుదెరువుకోసం 20 ఏళ్లక్రితం హైదారాబాద్‌కు వచ్చి గ్యాస్ వెల్డింగ్ పనిచేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలపారు. ఈక్రమంలో మద్యానికి బానిసై ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో మెదక్, నల్గొండ జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసంచేసి అందులోని కాపర్ వైర్‌ను దొంగిలించి అమ్ముకుంటున్నట్లు వివరించారు. భువనగిరి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో కాపర్‌వైర్ దొంగతనం కేసులో పోలీసులకు చిక్కి జైలుశిక్ష అనుభవించారని చెప్పారు. జైలు నుంచి విడుదలైన తర్వాత నందులాల్ కాపర్‌వైర్ దొంగతనాలకు పాల్పడుతన్నారని తెలిపారు. 7 నెలల వ్యవధిలో సిద్దిపేట జిల్లాలో 22, జనగామ జిల్లాలో 17, యాదాద్రి జిల్లాలో 2 మొత్తం 48 ట్రాన్స్ ఫార్మర్లలో కాపర్ వైర్ దొంగిలించినట్లు వివరించారు. మద్దూరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ట్రాన్స్ ఫార్మర్ ధ్వంసం కేసులో ఫింగర్‌ప్రింట్ గుర్తించారు. ఈ క్రమంలో మద్దూరు మండలం వల్లంపట్ల వద్ద గురువారం రాత్రి సీసీఎస్ పోలీసులు అంబేద్కర్ విగ్రహం వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా అది చూసిన నందులాల్ తప్పించుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు పట్టుకొని విచారించగా కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారని తెలిపారు. నిందితుడి నుంచి రూ.6,70,000 నగదు,3 బైక్‌లు, ఫోన్లు, 1,415 కిలోల కాపర్ వైర్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేయడానికి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వివరించారు. కేసును చాకచక్యంగా చేధించిన పోలీసు అధికారులను ఆమె అభినందించారు. కాగా కాపర్ వైర్ కొనుగోలు చేసిన మరో 7 గురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం చేస్తాం : ముజీబ్‌హుస్సేనీ

టిఎన్‌జిఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం ముజీబ్‌హుస్సేనీని సన్మానిస్తున్న ఆంధ్రా నుంచి తెలంగాణాకు వచ్చిన తెలంగాణ ఉద్యోగులు..

గన్‌ఫౌండ్రి, ఏప్రిల్ 10(ప్రభాతవార్త): తెలంగాణ ఉద్యోగుల భాద్యతల కోసం నిలబడుతాము..హక్కులకోసం పోరాడుతామని తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. ఎంముజీబ్‌హుస్సేనీ అన్నారు. 12 సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న సమయంలో ఆంధ్రలో వివిధ విభాగాలలో విధులను నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యోగులైన 49మందిని తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో దాదాపు 12 సంవత్సరాల తరువాతసొంత రాష్ట్రానికి వచ్చిన ఉద్యోగులు శుక్రవారం నాంపల్లిలోని హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ మ ర్యాదపూర్వకంగా కలిసిశాలువ కప్పి, పూలమాల వేసి సన్మానించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కారం కోసం కృషి చేయడం జరుగు తుందన్నారు. అంతేకాకుండా హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు. తెలంగాణ ఉద్యోగులే శ్రేయసే తమప్రధాన ధ్యేయమన్నారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం : కూన శ్రీనివాస్‌గౌడ్

మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్‌గౌడ్‌ను సత్కరిస్తున్న గణేష్‌నగర్ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్‌పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షులు చింతకుంట వెంకటేష్ యాదవ్, షాకీర్ తదితరులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్10 ప్రభాతవార్త

రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ విజయదుంధుభీ మోగిస్తుందని మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గణేష్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షులు చింతకుంట వెంకటేష్‌యాదవ్ నాయకత్వంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కాంగ్రెస్ మరింత చేరువైందని కాంగ్రెస్ ప్రభుత్వంవచ్చిన తదనంతరం మహిళలకు ఉచిత ఆర్టీసీ సౌకర్యం తోపాటు ఉచితవిద్యుత్, రేషన్‌కార్డుల జారీవంటి అనేకపథకాలను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి ప్రజల మన్ననలను పొందిందని కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గణేష్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ ఇంచార్జి చింతకుంట వెంకటేష్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీలోని అన్ని విభాగాలతో కలిసికట్టుగా శ్రమించి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్‌కు గణేష్‌నగర్ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ విజయాన్ని కానుకగా ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జాకీర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్‌గౌడ్‌ను ఘనంగా సత్కరించారు.

పవన్ ఖేరాపై అసోం సీఎం వ్యాఖ్యలు దురదృష్టకరం

పాటిగడ్డలో అసోం సీఎం వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు.

బేగంపేట ఏప్రిల్ 10,ప్రభాతవార్త

పవన్ ఖేరా పై అసోం సీఎం వ్యాఖ్యలపై సనత్ నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నేతలు భగ్గుమన్నారు. బేగంపేట పాటిగడ్డ డా.బీఆర్ అంబేడ్కర్, డా.జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద ధర్నా నిర్వహించి అవమానకర, బెదిరింపు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ మాట్లాడుతూ ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా పై అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ చేసిన అవమానకర, బెదిరింపు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి భాష ఉపయోగించడం చాలా దురదృష్టకరమన్నారు. ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు విశాల్ సుధాం మాట్లాడుతూ అసోం సీఎం పవన్ ఖేరా పై చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే ఆయన పవన్‌ఖేరాకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమాన్ని వి.చిరంజీవి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభను చాటిన ఎస్ఐని అభినందించిన ఏసిపి



కంటోన్మెంట్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:

ప్రెస్ నోట్‌మల్కాజిగిరి జోన్, బేగంపేట్ డివిజన్ పరిధిలోని మారేడుపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ నవీన్ మహారాష్ట్ర రాష్ట్రంలోని నాగ్‌పూర్ నగరంలో మార్చి 29 నుండి ఏప్రిల్ 3 వరకు నిర్వహించిన అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్–2025లో విశిష్ట ప్రతిభ కనబరిచి, మెడికోలీగల్ ఓరల్ విభాగంలో స్వర్ణ పతకం, హ్యాండ్లింగ్, లిఫ్టింగ్ ప్యాకింగ్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. ఈ ప్రతిభను గుర్తిస్తూ, బేగంపేట్ ఏసీపీ గోపాల కృష్ణ మూర్తి, మారేడుపల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఎస్ఐ నవీన్‌ను అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఎస్ఐ నవీన్ కృషి, నైపుణ్యం, అంకితభావం పోలీస్ శాఖకు గర్వకారణమని, ఇలాంటి విజయాలు ఇతర సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగ అరెస్ట్

రూ.5.20 లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లిలో దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నింధితుడి వద్ద నుంచి 5.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, మొబైల్ సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం రాజేంద్రనగర్ డిసిపి ఎస్.శ్రీనివాస్ వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లికి చెందిన సిరంగి బుచ్చయ్య ఈ నెల 5 వ తేదీన తన ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలు, మొబైలు సెల్‌ఫోన్లు, నగదును దోచుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, చుట్టుగుంట కాలనీకి చెందిన షేక్ షబ్బీర్ (24) వృత్తి రీత్యా మెకానిక్. షేక్ షబ్బీర్ రాత్రి వేళల్లో ఇళ్ల ల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. షేక్ షబ్బీర్‌ను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. బుచ్చయ్య ఇంట్లో దొంగత నం చేశానని పోలీసుల విచారణలో షబ్బీర్ ఒప్పుకున్నాడు. నింధితుడు వద్ద నుంచి సుమారు 5.20 లక్షల రూపాయల విలువ గల బంగారు ఆభరణాలు, మొబైల్ సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బేగంపేట కేంద్రంగా రేషన్ బియ్యం దందా

-ద్విచక్రవాహనాలపై సేకరించి పాటిగడ్డ ఆర్అండ్ బి కేంద్రంలో నిల్వ చేస్తున్న వైనం

-స్థానికులు సమాచారం ఇచ్చినా స్పందించని పోలీసులు?

బేగంపేట ఏప్రిల్ 10,ప్రభాతవార్త

బేగంపేట పాటిగడ్డ ఆర్ అండ్ బి నివాసాలే అడ్డాగా అక్రమ రేషన్ బియ్యం దందా సాగుతున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. స్థానికంగా ఉన్న కొందరు కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని అతి తక్కువకు కొనుగోలు చేసి వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెల్సింది. ఈ ముఠా సభ్యులు ద్విచక్రవాహనాలపై ప్రకాశం నగర్, పాటిగడ్డ, భగవంతాపూర్ తదితర బస్తీల్లో తిరుగుతూ రేషన్ కార్డు దారుల నుంచి తక్కువ మొత్తం చెల్లించి కొనుగోలు చేసి వాటిని తెల్ల గోతాలలో ప్యాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తూ అధిక లాభాలు దండుకుంటున్నారని, అలాగే వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన బియ్యాన్ని పాటిగడ్డలోని ఆర్ అండ్ బి క్వార్టర్స్‌లో నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెల్సింది. అయితే గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం లో ప్రాంతీయ పార్టీకి చెందిన ఓ వ్యక్తి వ్యాపారికి పోలీసులకు మధ్య వారధిగా వ్యవహరిస్తున్నట్లు తెల్సింది. ఈ విషయాన్ని గమనించిన కొందరు బేగంపేట పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించిన కొద్ది రోజుల క్రితం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆర్ అండ్ బి క్వార్టర్స్ వద్దకు చేరుకోగా ప్రాంతీయ పార్టీ నేత రంగంలోకి దిగి వారిని అక్కడి నుంచి వెళ్లిపోయేలా చేసాడన్న ఆరోపణలు ఉన్నాయి. గడచిన నాలుగు ఐదు నెలలుగా ఇక్కడ దందా యదేశ్చగా సాగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వాటిని అరికట్టాల్సిన పోలీసులే మౌనం పాటించడం ఏంటని స్థానికులు, ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు రంగంలోకి దిగి ఈ దందాపై స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి, పూర్తి స్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

పూర్తి స్థాయి విచారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటాం : బేగంపేట ఎసిపి గోపాలకృష్ణమూర్తి

బేగంపేట పరిధిలో జరుగుతున్న అక్రమ రేషన్ బియ్యం వ్యవహారం తన దృష్టికి రాలేదని, అయినా ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణ మూర్తి అన్నారు. బేగంపేట లో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ దందా విషయంపై ఏసీపీ వివరణ కోరగా పై విధంగా స్పందించారు. ఈ విషయంలో ఎవరు ఉన్నా వదిలేది లేదని వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలియజేసారు.

25న ఫీజుల నియంత్రణ కోసం 'మహా ధర్నా'

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

సైఫాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ప్రైవేటు పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న ఇందిరాపార్కు ఎదుట 'మహా ధర్నా' నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా నేషనల్ రక్షా సేన పార్టీ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తన్నారం నరసింహాయాదవ్ కార్యనిర్వహక అధ్యక్షుడు లింగన్న, ప్రధాన కార్యదర్శి బింగి రాములు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫీజుల నియంత్రణ కమిటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ప్రతి ఏడాది ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు 10 నుంచి 70 శాతం వరకు ఫీజులు పెంచడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల పెంపుపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో యాజమాన్యాలు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. స్కూల్ యాజమాన్యాలు చట్ట ప్రకారం కేవలం ట్యూషన్ ఫీజులు మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా డెవలప్‌మెంట్ పేరుతో, ఆనేక పేర్లు చెప్పి దోపిడీ చేస్తున్నాయని వారు ధ్వజమెత్తారు. ఈ ఫీజుల దోపిడీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 25న నిర్వహించే మహాధర్నాలో తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రాజేశం, సాయిరాం, యాదగిరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పంజాగుట్టలో ఆరు స్పా కేంద్రాలపై కేసులు నమోదు

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 10, ప్రభాతవార్తః

పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న స్పా సెంటర్లపై పంజాగుట్ట పోలీసులు వరుస దాడులు నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించిన దాడుల్లో భాగంగా సోమాజిగూడలోని అమృత మాల్‌లో ఉన్న మార్క్ యూనిసెక్స్ సెలూన్ అండ్ ఫ్యామిలీ స్పాపై దాడి చేశారు. అక్కడ యజమాని, భాగస్వామి, థెరపిస్ట్, కస్టమర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్పా నిర్వహణ సాగుతున్నట్టు గుర్తించి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అమీర్‌పేట్‌లోని ఏస్తెటిక్ వెల్‌నెస్ స్పాపై దాడి చేసి రిసెప్షనిస్ట్, థెరపిస్ట్, కస్టమర్‌ను పట్టుకున్నారు. స్పా యజమాని పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అదే ప్రాంతంలోని క్రిస్టల్ ఫ్యామిలీ సెలూన్‌పై దాడి చేసి యజమాని, థెరపిస్ట్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పంజాగుట్టలోని శ్రీ మనీషా ఫ్యామిలీ బ్యూటీ అండ్ ఆయుర్వేద స్పాపై దాడి చేసి రిసెప్షనిస్ట్, ఇద్దరు థెరపిస్టులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే పలువురు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. శ్రీనగర్ కాలనీలోని జయ శ్రీ వెల్‌నెస్ స్పాపై దాడి చేసి రిసెప్షనిస్ట్, థెరపిస్ట్‌ను అదుపులోకి తీసుకుని డీవీఆర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. అమీర్‌పేట్ ప్రాంతంలోని హెవెన్ స్పాపై దాడి చేసి రిసెప్షనిస్ట్, ముగ్గురు థెరపిస్టులను అదుపులోకి తీసుకున్నారు. మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడుల సందర్భంగా స్పా సెంటర్లలో ప్రొఫెషనల్ థెరపిస్టులు, అర్హత గల వైద్యులు, సీసీటీవీ కెమెరాలు సక్రమంగా లేకపోవడం, కస్టమర్ వివరాల రిజిస్టర్ నిర్వహించకపోవడం తదితర ఉల్లంఘనలను గుర్తించారు. పోలీసుల విధుల్లో అడ్డంకులు కలిగించినందుకు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ 221, 223 తో పాటు సీపీ యాక్ట్ 21/76 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పంజాగుట్ట పోలీసులు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన పెంచే ఇలాంటి గ్రంథాల అవసరం

గో స్వామి గోపాలకృష్ణ రచించిన గ్రంథాన్ని ఆవిష్కరించిన దృశ్యం

చిక్కడపల్లి ఏప్రిల్ 10 (ప్రభాతవార్త) : నేటి సమాజంలో ఆధ్యాత్మిక చింతన పెంచే ఇలాంటి గ్రంథాల అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పులివర్తి కృష్ణ మూర్తి అన్నారు. శుక్రవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికలో గోమాత సేవా ట్రస్ట్ , త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీ గో స్వామి గోపాలకృష్ణ రచించిన" ఈశ్వరుడు నందీశ్వరుడు గ్రంథాన్ని ఘనంగా ఆవిష్కరించారు. గ్రంథంలోని విశేషాలను, ఉపాసన ప్రాముఖ్యతను కృష్ణమూర్తి వివరించారు. రచయిత పడ్డ శ్రమను అభినందించారు. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ఎ జనార్దన మూర్తి మాట్లాడుతూ నిత్యం కళలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా ఉంటుందని, ఇలాంటి గ్రంథావిష్కరణలు జరగడం సంతోషకరమని పేర్కొన్నారు. గో స్వామి గోపాలకృష్ణ మాట్లాడుతూ తన రచన వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరిస్తూ, ఈ గ్రంథాన్ని గో రక్షకులు శెనిశెట్టి రాజమోళి గుప్త దంపతుల కు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. న్యాయవాది ఓగిరా ల రమేష్ అధ్యక్షత వహించగా సభలో వై. రాధాకృష్ణ, బండారుపల్లి రామచంద్ర రావు పాల్గొని ప్రసంగించారు.

బిసిలపై దాడులను అరికట్టాలి: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త రాష్ట్రంలో బీసీల పై అగ్రకులాల దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టేందుకు తక్షణమే ప్రభుత్వం ఖీబీసీ రక్షణ చట్టంఖీ తీసుకురావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక లేఖ రాశారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో బీసీ రక్షణ చట్టం తీసుకురావడానికి అక్కడి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అదే స్ఫూర్తితో తెలంగాణలోనూ తక్షణమే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి చట్టం చేయాలని కృష్ణయ్య కోరారు. వికారాబాద్ జిల్లా నవాబ్ పేట మండలం దాతాపూర్, పులి మామిడి గ్రామాల్లో భూ తగాదాల నెపంతో గొల్ల కురుమలపై రెడ్డి సామాజిక వర్గం వారు దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా రజకులను ఆలయాల్లోకి రానివ్వకుండా అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు. నల్గొండలో యాదవులపై, కరీంనగర్‌లో నాయి బ్రాహ్మణులపై, నిజామాబాద్‌లో వడ్డెరలపై, గద్వాలలో వాల్మీకులపై దాడులు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీతో పాటు, ఈ రక్షణ చట్టాన్ని కూడా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ చైర్మన్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ గౌడ్, కన్వీనర్ మోదీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలు దాడి వివాదం.. ప్రతీకార దాడిలో యువకుడి మృతి

తార్నాక, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి చేయగా హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషాదకర సంఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం రాత్రి జరిగిన ఘర్షణ శుక్రవారం ఉదయం విషాదంగా మారింది. వివరాల్లోకి వెళితే.. లాలాపేట్‌కు చెందతిన బాలకృష్ణ (గొల్లబాలు) అనే వ్యక్తి వద్దకు గురువారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో అతనికి తెలిసిన వారు మన్నే దిలీప్ కుమార్ (32) తన స్నేహితుడు సాయి కుమార్‌తో కలిసి గొల్లబాలు ఇంటికి వెళ్లారు. పాత కక్షల నేపథ్యంలో వారు అతనిని ఇంట్లో నుంచి బయటకు రమ్మని పిలిచి తమకు రూ. 1000 కావాలని అడిగారు. దీంతో నేను మీకి ఎందుకు డబ్బులు ఇవ్వాలని బెదిరించి పంపించాడు. వారు వేసుకున్న పథకం ప్రకారం అతిని బయటకు రమ్మని చెప్పడంతో అతని వచ్చాదు. అకస్మాతుగా వారి వెంట తెచ్చుకున్న పెట్రోలు, కారం పొడి చల్లారు. దీంతో ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే దిలీప్ కుమార్, సాయి కుమార్‌లను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. ఈ ఘటనపై బాల కృష్ణ దయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చి ఎలాంటి గొడవలు జరగకుండా అందరినీ పంపించారు. దీంతో విషయం తెలుసుకున్న బాల కృష్ణ కుమారుడు ఫణిందర్ అలియాస్ ఫణి తన తండ్రిపై జరిగిన దాడికి ప్రతీకారంగా తన స్నేహితుడైన రాకేష్‌తో కలిసి దిలీప్ కుమార్ ఇంటికి వెళ్లారు. అతడితో పాటు సాయి కుమార్‌పై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వారిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తలకు తీవ్ర గాయాల కారణంగా దిలీప్ కుమార్ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఫణిందర్, రాకేష్‌లపై హత్యా కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ టి. అశోక్ తెలి పారు. అలాగే బాల కృష్ణపై పెట్రోలు చల్లిన ఘటనపైనా కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతికి కారణమైన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

ఏషియన్ ఫిలిమ్స్‌లో డబ్బులు కాజేసిన ఉద్యోగి అరెస్ట్

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 10, ప్రభాతవార్తః ప్రముక సినీనిర్మాత, సినీ పంపిణీదారు సునీల్‌నారంగ్ కార్యాలయంలో పనిచేస్తూ దాదాపు కోటికిపైగా డబ్బులు కాజేసిన ఉద్యోగిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఏషియన్ ఫిల్మ్స్ అధినేత సునీల్ నారంగ్‌కు చెందిన జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 31లోని కార్యాలయంలో వనస్థలిపురంలో నివసించే విశ్వనాథ్ అనే వ్యక్తి అకౌంటెంట్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో నే బోగస్ ఖాతాలు సృష్టించి యజమానికి తెలియకుండా సరఫరాదారుకు ఇవ్వాల్సిన చెక్కుల మధ్యలో పెట్టి సంతకాలు చేయించాడు. దాదాపు మూడేళ్లపాటు యజమా నికి తెలియకుండా ఇలా దాదాపు కోటి రూపాయల మేర మోసానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని 2024లో జరిగి న ఆడిటింగ్‌లో గుర్తించారు. దీంతో సునీల్‌నారంగ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విశ్వనాథ్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సామాజిక అభివృద్ధికి తెలుగు భాషా నైపుణ్యం ఎంతో కీలకం : సుద్దాల అశోక్ తేజ

బాగ్ లింగంపల్లి డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సులో జాతీయ కవి డాక్టర్ సుద్దాల అశోక్ తేజ పాల్గొన్న దృశ్యం

చిక్కడపల్లి ఏప్రిల్ 10,ప్రభాతవార్త : సమకాలీన భారతదేశంలో ఉపాధి అవకాశాలకు, సామాజిక అభివృద్ధికి తెలుగు భాషా నైపుణ్యం ఎంతో కీలకమని జాతీయ కవి, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. శుక్రవారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ కళాశాల ఆధ్వర్యంలో తెలుగు భాషా నైపుణ్యం, వృత్తి అభివృద్ధి ఒక అంతర్విషయ దృక్పథం అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ తెలుగు భాషా గొప్పదనాన్ని వివరిస్తూనే, సమాజంలో స్త్రీ పాత్రను "విశ్వచలనానికి మూలం స్త్రీ" అని అభివర్ణించారు. రక్తపంకం నవల ఇతివృత్తాన్ని, జానపద గేయాలు, వచన కవిత్వంలోని అంతరార్థాన్ని విద్యార్థులకు వివరించారు. అట్టడుగు వర్గాలు ఎదుర్కొంటున్న సామాజిక అడ్డంకులను అధిగమించడానికి భాషా పరిజ్ఞానం, గట్టి సంకల్పం అవసరమని పేర్కొన్నారు. కాకా వెంకటస్వామి వంటి నాయకుల పట్టుదల, సి.నారాయణ రెడ్డి సాహిత్య సేవలను ఆయన స్మరించుకున్నారు. ప్రొఫెసర్ క్రిస్టోఫర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో ఒకటి కంటే ఎక్కువ భాషలపై పట్టు సాధించడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. భాషా నైపుణ్యం కేవలం సమాచార మార్పిడికే కాకుండా, మెరుగైన ఉపాధి అవకాశాలకు, సామాజిక అభివృద్ధికి కీలక మార్గమని ఆయన స్పష్టం చేశారు. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బహుళ భాషా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అంబెద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట శేఖర్, ముదిగొండ భవాని, కె.కవిత పాల్గొనగా ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 50 మంది పరిశోధకులు తమ పత్రాలను సమర్పించారు. అధ్యాపకులు, విద్యార్థుల భాగస్వామ్యంతో విజయవంతంగా ముగిసింది.

డిసిసి పదవులు పొందిన నాయకులకు ఆత్మీయ సన్మానం

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:

సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీలో కొత్తగా డీసీసీ పదవులు పొందిన నాయకులకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. సనత్ నగర్ నియోజకవర్గం బీ బ్లాక్‌కు చెందిన హన్మంత్ రావు వైస్ ప్రెసిడెంట్‌గా, జనరల్ సెక్రటరీలుగా శ్రీకాంత్ గౌడ్, ఎస్ఎస్ రావు, రాజు యాదవ్, సెక్రటరీలుగా ఖమర్ హమీద్, రోహిత్ ఆనంద్, రజినీకాంత్, సాయి గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పద్మా రాణి, వినోద్ సింగ్, స్పోక్స్‌పర్సన్‌గా ప్రతాప్ నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బ్లాక్ నాయకులు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి, పార్టీకి అంకితభావంతో పనిచేసిన నాయకులను అభినందిస్తూ వారి సేవలను కొనియాడారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, కొత్త బాధ్యతలు స్వీకరించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. పదవులు పొందిన నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ మార్గదర్శకత్వం, ప్రోత్సాహంతోనే తమకు ఈ అవకాశాలు లభించాయని తెలిపారు. ఆమె నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడంలో డాక్టర్ కోట నీలిమ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో పార్టీ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పని చేస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ కోట నీలిమ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేందుకు కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్‌కు, తమకు సన్మానం చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిసిపికి ఫిర్యాదు

డీసీపీకి వినతిపత్రం సమర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:

మీడియా, కుల సంఘాల పేరుతో నిర్మాణదారులపై కొంతమంది బెదిరింపులకు పాల్పడుతున్నారని సికింద్రాబాద్ భవన నిర్మాణదారుల అసోసియేషన్ సభ్యులు సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, అడిషనల్ డీసీపీ నర్సలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. కొంతమంది మీడియా, కుల సంఘాల పేర్లు చెప్పి బలవంతపు వసూల్‌లు చేస్తున్నారని, తమ కార్యాలయాలకు రావాలని భవన నిర్మాణదారులపై వత్తిడి తెస్తున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాంసుందర్ ఆధ్వర్యంలో నేతలు ఫిర్యాదు చేవారు. బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మీడియా పేరుతో వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపిస్తామని తెలిపారు. దర్యాప్తు అనంతరం బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

డిమాండ్లు సాధన కోసం విద్యుత్ ఆర్టిజన్లు ధర్నా

ధర్నాలో పాల్గొన్న చార్మినార్ డివిజన్ పరిధిలోని ఆర్టిసన్లు, కార్మికులు

చార్మినార్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :

విద్యుత్ ఆర్టిసన్, అన్‌మ్యాన్డ్, పీస్ రేటు కార్మికుల సమస్యల సాధన కోసం రెండవ రోజు టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ డివిజినల్ కార్యాలయం వద్ద తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టిసన్లు ధర్నా నిర్వహించారు. చార్మినార్ డివిజన్ పరిధిలో పని చేస్తున్న ఆర్టిసన్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యా అర్హతలు ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలని, ఆర్టిసన్లకు ఎపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, టిజిఎన్‌పిడిసిఎల్, టిజిఎస్‌పిడిసిఎల్‌లలో అన్‌మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిజన్లుగా విలీనం చేయాలని, విద్యుత్ సంస్థలలో పని చేస్తున్న పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, 2026 పిఆర్‌సి వేతన సవరణ చేయాలని ధర్నాలో పాల్గొన్న ఆర్టిన్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసి చార్మినార్ డివిజన్ అధ్యక్షులు మహ్మద్ యూసుఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్, కార్యదర్శి మహ్మద్ వహీద్, ప్రతినిధులు రాము, శేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అన్నా హజారేతో అరుణ్‌కుమార్ భేటి


అన్నా హజారేను కలిసిన డాక్టర్ ర్యాగా అరుణ్‌కుమార్

సైఫాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారేను శుక్రవారం పుణేలో జాతీయ బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ర్యాగా అరుణ్‌కుమార్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు తెలంగాణ రాష్ట్రంలో జరిగిన పలు అంశాలపై చర్చించారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కుమ్మెర గ్రామంలో పసి కందు హత్యపై సిబిఐచే న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రంలో భూదాన్ భూముల దోపిడీని అరికట్టాలని, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో జరిగిన అవినీతి ఆరోపణలు, సాంకేతిక సమస్యలు, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో పగుళ్ల, వంటి సమస్యలపై ఆయన అన్నా హజారేకు వివరించారు.

భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్

చిక్కడపల్లి ఏప్రిల్ 10 (ప్రభాతవార్త) : భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి కార్యక్రమం భారత్ భారతి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ వినయ్ పత్రాలే నేతృత్వం వహించి ప్రసంగించారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం సర్దార్ పటేల్ చేసిన కృషి అనన్య సామాన్యమని, ఆయన ఆశయాలను భావి తరాలకు అందించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఏడాది పొడవునా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి, ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు సంజయ్ గణాటె , సిఎస్ చవాన్, జస్మత్ పటేల్, భారత్ భారతి వినయ్, విజయ్ సురానా, డాక్టర్ అరుణ, ఆలే భద్కర్, వీరేందర్ గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. భారత ఐక్యతకు పటేల్ అందించిన సేవలను స్మరించుకుంటూ, రాబోయే వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని వారు నిర్ణయించారు.

డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ వాడకంపై ప్రత్యేక తనిఖీలు..

కార్వాన్ ఏప్రిల్10,ప్రభాతవార్త డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ వాడకంపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు చేస్తూ వారం రోజుల్లో6,046 కేసులు నమోదు చేసినట్టుగ్గా హైదరాబాద్ నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి.జోయల్ డేవిస్ ఐపీఎస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వాహనాలు నడిపేటప్పుడు సెల్ ఫోన్ ఉపయోగించడం వల్ల జరుగుతున్న ప్రమాదాలను అరికట్టడానికి, రహదారి భద్రతను మెరుగుపరచడానికి హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు 3వ తేదీ నుండి 9వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా తనిఖీలలో డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ వాడుతున్న 6,046 మంది నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించి, వారిపై కేసులు నమోదు చేశారన్నారు. వీరిలో ద్విచక్ర వాహనదారులు 5,810 మంది, ఆటో, త్రీ వీలర్ డ్రైవర్లు 51 మంది, కార్లు, ఇతర వాహనదారులు 185 మందిపై కేసులు నమోదు చేశారన్నారు. ఒక్క క్షణం పాటు దృష్టి మళ్లినా, అది వాహనదారుడితో పాటు ఇతర ప్రయాణీకులు, పాదచారుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారందరిపై చార్జ్‌షీట్లు దాఖలు చేసి, గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరుస్తామని, చట్టప్రకారం జరిమానాలు విధిస్తామని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్లకు దూరంగా ఉండి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి.జోయల్ డేవిస్ వాహన దారులను కోరారు.

గంజాయి సేవిస్తున్న 14 మందిపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 10, ప్రభాతవార్తః

వేర్వేరు కేసుల్లో గంజాయి సేవిస్తున్న 14 మందిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో నలుగురు రౌడీషీటర్లు సైతం ఉన్నారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సుహాసన్ కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12 శ్రీరాంనగర్‌లో గురువారం రాత్రి పలువురు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటనలో బంజారాహిల్స్ ఠాణా పరిధిలో రౌడీషీటర్లుగా ఉన్న వంశీ, సాయికుమార్, సయ్యద్ మాజిద్, విజయ్‌కుమార్‌లతోపాటు కూకట్‌పల్లికి చెందిన రోహిత్ కుమార్ పెంట(24), బోరబండకు చెందిన హరీష్‌గౌడ్(31), సుబ్రమణ్యం(26), సాయికుమార్(23), కుత్బుల్లాపూర్‌కు చెందిన ఆదిత్యకుమార్(21), సూర్య దేవరకొండ(19), బాచుపల్లికి చెందిన సూర్యతేజ(21), మల్లంపేటకు చెందిన మణికంఠ(23), బాల నగర్‌కు చెందిన నవీన్‌కుమార్(22) ఉన్నారు. వీరందరిని అదుపులోకి తీసుకొని వైద్య పరీక్షల నిమత్తం తరలించారు. మరో సంఘటనలో అన్నపూర్ణ స్టూడియో ముందు ఉన్న నిర్జన ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న వంశీని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 10 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సెల్‌ఫోన్ దోపిడికి పాల్పడిన ముఠాలో ఇద్దరి అరెస్ట్

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 10, ప్రభాతవార్తః జూబ్లీహిల్స్‌లో తెల్లవారుజామున దోపిడికి పాల్పడి సెల్‌ఫోన్ లాక్కెళ్లిన ముఠాలో ఇద్దరిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జొమాటలో పనిచేసే ఒక యువకుడు గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్‌లో వెళ్తున్నాడు. అదే సమయంలో బుధవారం అర్ధరాత్రి దాటే వరకు ఒక యువ నాయకుడి జన్మదిన వేడుకల్లో డీజే ప్లే చేసిన పవన్, ప్రతీక్ రెడ్డిలతోపాటు మరో ముగ్గురు మద్యం సేవించి వాహనాలపై వెళ్తున్నారు. జొమాటో యువకుడిని అకారణంగా తిట్టడంతో అతను ప్రశ్నించాడు. మద్యం మత్తులో ఉన్న వారు అతనిపై దాడి చేసి అతని సెల్‌ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. జరిగిన సంఘటనపై జొమాటో బాయ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పవన్, ప్రతీక్‌రెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు. మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ సంపత్

గాంధీనగర్‌లో కాల్వల పూడికతీత తొలగింపు

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మండలంలోని గాంధీ నగర్ గ్రామంలో మురుగు కాల్వల్లో మట్టి, పూడికను తొలగించే పనులను శుక్రవారం సర్పంచ్ పోలు సంపత్ ప్రారంభించారు. సర్పంచ్ స్వయంగా జెసిబిలు, పారిశుధ్య కార్మికుల సహాయంతో భారీ స్థాయిలో కాల్వల క్లీనింగ్ పనులను చేపట్టించారు. కాల్వల్లో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తూ మురుగునీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంపత్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్ర వాతావరణానికి అత్యంత ప్రాధాన్యత అని తెలిపారు. మురుగునీరు నిల్వ లేకుండా చేయడం ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.

హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది బదిలీ

బదిలీపై వెళ్తున్న సిబ్బందితో ఎక్సైజ్ సిఐ, ఎస్ఐలు

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : హుస్నాబాద్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, తొమ్మిది మంది కానిస్టేబుళ్లకు కరీంనగర్ జిల్లాలోని వివిధ ఎక్సైజ్‌స్టేషన్లు, స్క్వాడ్ వింగ్స్‌కు బదిలీలు జరిగినట్లు సిఐ పవన్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ పవన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హుస్నాబాద్ స్టేషన్‌లో పనిచేసిన కాలంలో సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించారని, బదిలీపై వెళ్లేచోట అదేవిధంగా క్రమశిక్షణతో పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బదిలీపై వెళ్లే సిబ్బందిని సహచరులు అభినందిస్తూ వారి సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లే సిబ్బందికి ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రూపరెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త విభజనపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మీకొమురయ్య

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీకొమురయ్య ఆధ్వర్యంలో 16వ వార్డులో చెత్త విభజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ ప్రజలు చెత్తను తడి పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు. ఇంటిలో ఖాళీ స్థలం ఉన్నవారు తడి చెత్తతో ఎరువు తయారు చేసుకుని మొక్కలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా మెప్మా ఆధ్వర్యంలో ఉన్న స్టీల్ బ్యాంకులను వినియోగించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిని తొలగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ వైద్యం కిరణ్‌ప్రసాద్, పర్యావరణ అధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ సూపర్‌వైజర్ నవీన్, ఇన్‌చార్జి వార్డ్ ఆఫీసర్లు మొగిలి, శ్రీకాంత్, ఆర్‌పి సృజన సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల బలోపేతానికి సర్పంచ్‌లు సహకరించాలి

-గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు

మాట్లాడుతున్న సిఐ రవిరాజు

మర్కుక్, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): గ్రామాల్లో శాంతిభద్రతల బలోపేతానికి సర్పంచ్‌లు, ప్రజలు సహకరించాలని గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రం మర్కుక్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ దామోదర్ ఆధ్వర్యంలో మండలంలోని 16 గ్రామాల సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు మన పోలీస్ మన ఊరు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సిఐ రవిరాజు మాట్లాడుతూ మన పోలీస్ మన ఊరు కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని కోరారు. ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ సేవలపై ప్రజలు అవగాహన కలిగివుండాలని తెలిపారు. ఐపిఎల్ సందర్భంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా రోడ్డు భద్రతపై దృష్టి సారిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, హెల్మెట్‌తో పాటు వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో సిసి కెమెరాల ఏర్పాటు కోసం సహకరించాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలతో పాటు ప్రజల్లో సామాజిక అవగాహన పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జ్ఞాన ర్యాలీని విజయవంతం చేద్దాం

-జయంతోత్సవాల కమిటీ సభ్యుడు నీరుడి స్వామి

గజ్వేల్, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): పట్టణంలోని ఈనెల 14వ తేదీన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే అంబేద్కర్ జ్ఞాన ర్యాలీని విజయవంతం చేద్దామని జయంతోత్సవాల కమిటీ సభ్యులు నీరుడి స్వామి, ఉబ్బని ఆంజనేయులు, బైరం శివకుమార్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్ గ్రామంలో సర్పంచ్ నర్సింలు, మాజీ సర్పంచ్ బాపిరెడ్డి, మాజీ ఎంపిటిసి లడ్డుతో కలిసి జయంతోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలోని కోటమైసమ్మ ఆలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించే ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవీందర్, అనిల్, శ్రీకాంత్, రమేష్, స్వామి పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సామూహిక కలశాల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

దత్తాత్రేయ విగ్రహ ప్రతిస్థాపన ఉత్సవాలు

సదాశివపేట, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): స్థానిక శ్రీసంగమేశ్వర మందిరంలో దత్తాత్రేయ విగ్రహ స్థాపన సందర్భంగా ఆలయ కమిటీ భక్త బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఏడు గంటలకు సామూహిక మహిళలచే కళాశాల ఊరేగింపు, ఎనిమిది గంటలకు గోపూజ, విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం, మాతృక, నాంది, సమారాధనం, అంకురార్పణ, కౌతిక బంధనం, అగ్ని ప్రతిష్ట, సర్వతో భద్ర మండల ప్రధాన దేవత, యోగిని,వాస్తు, క్షేత్రపాల, నవగ్రహమండల ఆహ్వాన పూజ,హారతి మంత్రపుష్పం, చతుర్వేద సేవ అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ భక్త బృందం మల్లికార్జున పూర్ణచందర్, ఆకుల శివకుమార్, మారేపల్లి చిన్నశివకుమార్, ముంగి మల్లేశం, రాచన్న స్వామి, రామ్‌రెడ్డి, ప్రభు, సుధాకర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవునికి దీపారాధన

సదాశివపేట, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): మండలంలోని అరుర్ గ్రామ శివారులో కొలువైన శ్రీకాలభైరవస్వామికి అత్యంత ప్రీతికరమైనరోజు కలాష్టమి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఈరోజు కలాష్టమి సందర్భంగా శ్రీకాలభైరవ స్వామి,మహాలక్ష్మి ్మ ,కుబేర స్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆలయంలో కుష్మాండ దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారుఆలయ పూజారి మదుపతి సంతోష్ స్వామి మాట్లాడుతూ ఈరోజు విశేషంగా ఆ కాలభైరవ స్వామిని దర్శించుకుని స్వామి ముందు దీపారాధన చేయడం వల్ల సకలపాపాలు తొలిగి ఆయురా రోగ్యలు, భోగభాగ్యాలు, నర దిష్టితొలగి, ఆయురారోగ్యాలతో ఉంటారని అపారమైన నమ్మకం అని అన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల కాకుండా దూర ప్రాంతాల నుండి సైతం భారీగా భక్తులు పాల్గొన్నారు.

తుల్జాభవాని మాతకు గంగాభిషేకం

తుల్జాభవాని మాతకు అభిషేకానికి మంజీర జలాలు తీసుకువెళ్తున్న మహిళలు

పుల్‌కల్, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారేడ్డిపేట గ్రామంలో భక్తుల పాలిట కల్పవల్లిగా వెలసిన శ్రీ తుల్జాభవాని మాత 33వ వార్షిక జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి అమ్మవారికి ఆలయ పూజారి మాత నర్సమాంబ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ శివారులోని సంగమేశ్వర ఆలయం నుంచి మంజీరా నది నుండి తీసుకు వచ్చిన నీటిని రాగికలశాలతో ఏకరూప దుస్తులు దరించిన 251మంది మహిళలు తుల్జాభవాని ఆలయం వద్దకు మంగళ వాయిద్యాలతో తీసుకు వచ్చి భవాని మాతకు అభిషేకం చేశారు. గ్రామానికి చెందిన బాలికల కోలాటం,నృత్యాలుఅందరిని అకట్టుకున్నాయి. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ నిర్వహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాలలో సదాశివపేట ప్రముఖ వ్యపారవేత్త చిందికేరి సత్తిష్ కుమార్, రాజు పటేల్, కాంగ్రేస్ నాయకులు కుమ్మరి లింగయ్య, అలయ పూజారి పరుశురామ్, చిందం నగేష్ పాల్గోన్నారు.

యువత స్వయం ఉపాధితో ముందడుగు వేయాలి

- సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

గుమ్మడిదల ఏప్రిల్ 10 ప్రభాతవార్త : యువత స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకొని ఆర్థికంగా ముందడుగు వేయాలని సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు.గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో మధుగౌడ్ ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం ఉపాధి ద్వారా యువత ఆర్థికంగా బలపడటంతోపాటు సమాజ అభివృద్ధికి తోడ్పడగలరని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నతరహా వ్యాపారాలు ఏర్పడటం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఇటువంటి వ్యాపారాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, మరింత మంది స్వయం ఉపాధి వైపు ముందుకు రావడానికి ప్రోత్సాహం ఇస్తాయని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సురభి కుమార్‌గౌడ్, శ్రీమర్లం చక్రపాణి, కత్తుల రమేష్, నాయకులు ఇంద్రసేనరెడ్డి, సత్యనారాయణ, వెంకట్రామిరెడ్డి, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, సదానందరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శంకర్, మల్లికార్జునగౌడ్, దాసరి కృష్ణ పాల్గొన్నారు.

రావి ఆకుపై జ్యోతిరావు పూలే చిత్రం

సిర్గాపూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: బడుగు బలహీన వర్గాల హక్కులపై పోరాడి బడుగులకు అండగా నితిచిన పోరాట యోధులు మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రాన్ని లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ రావి ఆకుపై గీసి అభిమానాన్ని చాటుకున్నారు. జ్యోతిరావు పూలే జయంతిని పురష్కరించుకుని నీలి రంగులతో రావి ఆకుపై పేయింటింగ్, రావి ఆకుపై జ్యోతిరావు పూలే చిత్రాన్ని వేసి పూలే సేవలను శివకుమార్ స్మరించుకున్నారు.

చిరుత సంచరిస్తున్నా పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు

అల్లాదుర్గం అసెంబ్లీ సాధన సమితి అధ్యక్షుడు బ్రహ్మం

అల్లాదుర్గం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:

చిరుత పులి అల్లాదుర్గం, రేగోడు, పెద్ద శంకరం పేట మండలాల్లోని గ్రామాల్లో సంచరిస్తున్నట్లు తెలిసినా ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అల్లాదుర్గం అసెంబ్లి సాధన సమితి అధ్యక్షులు బ్రహ్మం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ మండల ఫారెస్ట్ రేంజ్ అధికారుల నిర్లక్ష్య ధోరణితో విధులు నిర్వహిస్తున్నారని, పెద్ద శంకరంపేట తదితర మండలాల్లో చిరుత సంచాం చేస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు దృవీకరించారని, గట్టు చర్యలు చేపట్టేలేదన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరితో గత రెండు రోజులుగా రేగోడు మండలంలోని తిమ్మాపూర్‌లో ఒక లేగ దూడను చిరుతపుల్లి పట్టుకుని తిన్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారన్నారు.

గత నెలలో జిల్లా కలెక్టర్ ప్రజా ఫిర్యాదుల విభాగం లో ఫిర్యాదు చేయడం జరిగిందని, చిరుతను పట్టుకుని దట్టమైన అడువుల్లో వదిలేయాలని సూచించినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడంతో వ్యవసాయ పొలాలకు వెళ్లే అన్నదాతలు, పశువుల కాపర్లు భయందోళనకు గురికావాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం సైతం చిరుత పులి ఓ మూగజీవాన్ని చంపేసి రైతును ఆర్థికంగా, మానసికంగా కృంగిపో యేలా చేసినా ఫారెస్ట్ అధికారికి ఫోన్ చేసి పులిని పట్టుకోవాలని, నష్టపోయిన రైతుకు నష్టపరిహారం అందించాలని కోరినట్లు పేర్కొన్నారు. పులిని పట్టుకునేందుకు సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తామని, పులిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తామని సదరు అధికారి పేర్కొన్నట్లు బ్రహ్మం పేర్కొన్నారు. అధికారులు స్పందించకుంటే ధర్నా చేస్తామని బ్రహ్మం హెచ్చరించారు.

అందోలు చెరువు సమీపంలో మురికి కాలువ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

రూ.3.14కోట్లతో భారీ మురికినీటి కాలువ నిర్మాణం

జోగిపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: పట్టణంలో గౌని వద్ద నుంచి ఫైర్ స్టేషన్ వరకు భారీ మురికి నీటి కాలువ నిర్మాణం పనులను శుక్రవారంనాడు మున్సిపల్ చైర్మన్ ఎస్.క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. రూ.3.14కోట్లతో ఈ నిర్మాణం పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా ఇక్కడ మురికి కాలువ లేక పోవటంతో పలు వార్డులకు సంబంధించిన మురికి నీరంతా అందోలు చెరువులో కలిసి కలుషితమౌతున్నాయి. ఈ పరిస్థితుల్లో గౌని వద్ద నుంచి ఫైర్‌స్టేషన్ వరకు భారీ మురికి నీటి కాలువ నిర్మాణం చేపడుతున్నారు. దీని నిర్మాణం వల్ల ప్రధానంగా 9,10 వార్డు ప్రజలకు మురికి నీటి ఇబ్బంది తొలగుతుంది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ పక్షోత్సవాలు

వెల్దుర్తి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం టీచర్లు సర్పంచుల అధ్యక్షతన పోశం పక్కోడ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి కేంద్రానికి వచ్చే గర్భిణీలు. పాలిచ్చే తల్లులకు జీరో నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు పోషకాహారం. ఎదిగే పిల్లలకు పోషక విలువలతో కూడిన అందించాలని సూచించారు. పూర్తిగా మానేయాలని తెలిపారు. ఆకుకూరలు. సీజన్లో దొరికే పండ్లు. ఆకుపచ్చగా పసుపు పచ్చగా ఉండే కూరగాయలు పిల్లలకు ఎక్కువగా ఇవ్వాలని సూచించారు. పిల్లలు ఎదుగుదలతో సమస్యలు ఉన్నట్లయితే వయసుకు తగిన ఎత్తు ఉన్నట్లయితే ప్రతినెల అంగన్వాడి కేంద్రంలో తీసి తక్కువ బరువు ఉన్న పిల్లలకు ప్రెస్ ఇవ్వడం జరుగుతుందని వారన్నారు. ప్రతి ఇంటికి పోషన్ పక్కోడ అందించే విధంగా కృషిచేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు చిన్నారు తల్లిదండ్రులు. ఏఎన్ఎం. ఆశా వర్కర్లు. పాల్గొన్నారు

ముగిసిన సర్పంచుల శిక్షణ కార్యక్రమం

శిక్షణలో పాల్గొన్న హత్నూర మండల సర్పంచులు

హత్నూర ఏప్రిల్ 10 ప్రభాతవార్త : హత్నూర మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఐదు రోజులపాటు సంగారెడ్డిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఇంచార్జ్ డిపిఓ జానకి రెడ్డి. సంగారెడ్డి డిఎల్‌పిఓ అనిత, జహీరాబాద్ డిఎల్పిఓ అమృత లు, టి ఓ టి లు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శిక్షణ పొందినట్లుగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. శిక్షణ సందర్భంగా పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన కలిగిస్తూ సర్పంచుల అధికారాలు, బాధ్యతల గురించి వివరించారు. సంగారెడ్డి జిల్లాలో విడతల వారీగా చేపట్టిన శిక్షణ కార్యక్రమం ఈ బ్యాచ్ తో పూర్తి అయిందని ఇన్చార్జి డిపిఓ జానకి రెడ్డి తెలిపారు.

జిపివోపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

హత్నూర ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామ పాలన ఆఫీసర్ భూపాల్ క్షేత్ర స్థాయి విచారణ కొరకు విధి నిర్వహణలో భాగంగా భూమి మీదకు వెళ్లగానే కండ్లల్లో కారంపొడి చల్లి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షి ంచాలని గ్రామ పాల అధికారుల అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు జి సాయికుమార్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ,ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వెంటనే గ్రామ పాలన ఆఫీసర్ పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు

శాంతి భద్రత పరిరక్షణకు సహకరించాలి : ఎస్ఐ

సర్పంచ్‌లతో సమావేశం అయిన ఎస్ఐ రాజేందర్‌రెడ్డి

మొగుడంపల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: చిరాగ్‌పల్లి పోలీసు ఠాణా పరిధిలోని గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు సర్పంచ్‌లు తమ వంతు సహకారం అందించాలని చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పోలీసు ఠాణాలో ఎస్ఐ రాజేందర్‌రెడ్డి సర్పంచ్‌లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణకు, అసాంఘీక కార్యక్రమాలను అడ్డుకునేందుకు సర్పంచ్‌లు తమ వంతు సహకరించాలన్నారు. ప్రతి గ్రామంలో దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి సీసీ కెమెరాలను పోలీసు ఠాణాకు అనుసంధానం చేయాలని సూచించారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్ఐ రాజేందర్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి నిత్య జీవితంలో క్రీడలు భాగం కావాలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం భానూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన జీవితాన్ని పేద, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత నేత టంగుటూరి అంజయ్య అని కొనియాడారు. అంతటి గొప్ప వ్యక్తిని స్మరిస్తూ కిడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడా పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అంజయ్య చిత్రపటానికి పూలమాలు వేస్తున్న దృశ్యం

డాక్టర్ అన్నపూర్ణను సన్మానిస్తున్న దృశ్యం

డాక్టర్ అన్నపూర్ణకు ఘన సన్మానం

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 10 (ప్రభాతవార్త): వైద్య ఆరోగ్య శాఖలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్న గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణను శుక్రవారం స్థానిక మాతా శిశు సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల, డాక్టర్ రేఖ, డాక్టర్ సుజాత, డెంటిస్ట్ డాక్టర్ నాగలక్ష్మి, ఆప్తమాలోజి డాక్టర్ కవిత, డాక్టర్ శ్రీజ, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాను వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ విమల, ఫార్మసీ ఆఫీసర్స్ శ్రీనివాస్‌చారి, మోహన్ బండారి, హెడ్ నర్సులు నిర్మల, వకులాదేవి, నర్సింగ్ ఆఫీసర్స్ సిహెచ్.పుష్ప, జే.శాంతి, కనకలక్ష్మి, రాణి, శకుంతల, అమృత, హెల్త్ సూపర్వైజర్ కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, ఇమ్యునైజేషన్ డిపార్ట్మెంట్ ఏఎన్ఎంలు తుమ్మ లత, భారతి, థియేటర్ అసిస్టెంట్స్ ఆంజనేయులు, మురళి, రవి, ల్యాబ్ టెక్నీషియన్‌లు కె.సౌందర్య, జి.రాజేశ్వరి, బి.రమాదేవి, డాటా ఎంట్రీ ఆపరేటర్స్ జి.అశోక్, స్రవంతి, సబార్డినేట్ కనకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పదవులను అమ్ముకునే సంస్కృతి కాంగ్రెస్‌కు లేదు

పట్టణ అధ్యక్షుడు అత్తు



మాట్లాడుతున్న అత్తు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 10,ప్రభాతవార్త : నామినేటెడ్ పదవులను అమ్ముకునే సంస్కృతి కాంగ్రెస్ పార్టీకి లేదని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని జెండా మోసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు న్యాయం చేసేందుకు నామినేటెడ్ పోస్టులను కేటాయించడం జరుగుతుందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి రోజు రోజుకు పెరుగుతున్న ప్రజల ఆధారణ చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పూజల హరికృష్ణ బరిలోకి దిగడంతోనే హరీష్‌రావు మెజార్టీ తగ్గిందన్నారు.పూజల హరికృష్ణ నాయకత్వంలో సిద్దిపేటలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపైకి వస్తున్నారని తెలిపారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ నాయకులపై పార్టీపై బిఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యాలు చేస్తే సహించేదిలేదన్నారు.సమావేశంలో పార్టీ నాయకలు మధు,గయాజుద్దీన్, హర్షద్‌హుస్సేన్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ రాజ్యలక్ష్మీ

కొమురవెల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంత పేదలకు ఎంతో మేలు చేస్తాయని సర్పంచ్ అక్కెనపల్లి రాజ్యలక్ష్మీ అన్నారు. మండల పరిధిలోని రాంసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సర్పంచ్ అక్కెనపల్లి రాజ్యలక్ష్మీ, ఉపసర్పంచ్ మల్లారెడ్డి, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో డాక్టర్ రాజేశ్వర్ ఎండి.డెంటల్ డాక్టర్ భావన(లలిత భవాని ఆసుపత్రి) సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో 200 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి బ్లడ్ టెస్ట్, బ్లడ్ షుగర్ టెస్ట్, ఈసీజీ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సూచనలు చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

రైతు భరోసా, పంట నష్టపరిహారం చెల్లించాలి

బిజెపి మండల అధ్యక్షుడు సంపత్‌నాయక్

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుభరోసా నిధులు, అలాగే మెంతా తుఫాన్ కారణంగా పంటలకు జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారం వెంటనే చెల్లించాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా సంపత్‌నాయక్ డిమాండ్ చేశారు. యాసంగి సీజన్‌లో నాట్లు పూర్తవుతున్నప్పటికీ ఇప్పటివరకు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదని, ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షాలతో పత్తి, మక్కా, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. అదే విధంగా మెంతా తుఫాన్ ప్రభావంతో అనేక మంది రైతులు పెట్టుబడులు తిరిగి పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి రైతుల పాసుపుస్తకాలు, బ్యాంకు ఖాతాల జిరాక్స్ తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు నష్టపరిహారం చెక్కులు అందలేదని తెలిపారు. ఖరీఫ్, రబీ సీజన్లలో సన్న వడ్లకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు రైతులఖాతాల్లో బోనస్ డబ్బులు జమ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా నిధులు, పంట నష్టపరిహారం చెక్కులు సన్న వడ్ల బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమచేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 10,ప్రభాతవార్త : పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, జిల్లా ఆర్టీఏ సభ్యులు, డిసిసి ఓబిసిసెల్ చైర్మన్ డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ సూర్యచంద్రవర్మ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని 45మంది లబ్దిదారులకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేసి వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సిద్దిపేట నియోజకవర్గ ప్రజలకు విద్యా, వైద్య విషయంలో సహకరించడానికి సిద్ధంగా ఉంటానని తెలిపినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మంద పాండు,సతీష్, సదాశివరెడ్డి, అంజిరెడ్డి, చిరంజీవి, శ్రీకాంత్, జిత్తు, వెంకట్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీఓ

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10,ప్రభాతవార్త: మండలపరిధిలోని మల్లుపల్లిలో నిర్వహిస్తున్న ఈజిఎస్ పనులను ఎంపీడీవో దామోదర్ శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనులు చేసే వద్ద మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇమ్మడి నరేష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ దామోదర్

గ్రంథాలయ ఏర్పాటుకై పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జడ్పీహెచ్ఎస్‌లో గ్రంథాయ ఏర్పాటుకు చర్యలు
ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుచేసేందుకు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటైతే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్‌సేట్, సర్పంచ్ అనిల్‌పాటిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం...

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: పేదల సొంతింటికలను ఇందిరమ్మ ఇళ్లతో కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని దామరగిద్దలో పేదలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించి గృహప్రవేశం చేశారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, సర్పంచ్ రాజు, ఉపసర్పంచ్ పండరినాథ్‌రావుపాటిల్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా తుల్జాభవాని ఆలయ 33వ జాతర మహోత్సవం

తుల్జా భవానిమాతను దర్శించుకుంటున్న నర్సింలు

పుల్‌కల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో కొలువున్న శ్రీతుల్జా భవానిమాత ఆలయ 33వ జాతర మహోత్సవాలు శుక్రవారం శోభాయమనంగా నిర్వహించారు. జాతర మహోత్సవాలకు తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు, మెదక్, చేవేళ్ల పార్లమెంట్‌ల కన్వీనర్‌లు ఇల్లెందుల రమేష్, కట్టా వెంకటేశంగౌడ్, కుమ్మరి ఆంజనేయులుతో కలిసి ఆలయాన్ని దర్శించుకుని అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజలు నిర్వహించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వారి కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కుమ్మరి లింగయ్య, నర్సిమాంబ, సంగమయ్య, బబ్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్

కౌడిపల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధికి కృషి చేస్తాని పాంపల్లి గ్రామ సర్పంచ్ యశోద బాలకృష్ణ అన్నారు. శుక్రవారం గ్రామంలోని ఒకటవ వార్డులో కొంత కాలంగా లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసుల తెలియజేయగానే విద్యుత్ అధికారులతో చర్చించి, కాలనీలోనే 25 కేవీ సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి, సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సర్పంచ్‌గా గెలుపొందిన తర్వాత సొంత నిధులతో ప్రధాన వీధుల గుండా ప్రత్యేక పైపులైన్లు బిగించి నీటిని అందించడం జరిగిందన్నారు. గ్రామంలో శాశ్వతంగా ఉండే విధంగా వీధిలైట్లు, ప్రధాన కూడలీల వద్ద సిసి కేమెరాలను బిగించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. నూతనంగా గ్రామ పంచాయతీ ఏర్పాడినందున గ్రామంలో చాల సమస్యలు ఉన్నయని వాటిని ప్రణాళికబద్ధంగా అంచెలంచెలుగా పరిష్కరిస్తానని ఆమె హామి ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యనారాయణ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాట్రియాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ స్రవంతిరాజేందర్

రామాయంపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం కోసమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రామాయంపేట మండలం కాట్రియాల గ్రామ సర్పంచ్ కొత్త స్రవంతిరాజేందర్ సూచించారు. గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఉపసర్పంచ్ బాబునాయక్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యం దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు. అంతకుముందు ఉచిత పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ స్రవంతి ప్రారంభించారు. గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచిత వ్యాక్సినేషన్ పంపిణీ చేపట్టిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సీసీ విజయలక్ష్మి, వివోఏ కమ్మరి శ్యామల, రాజు, కమ్మరి రమేష్ చారి, సుధాకర్ రెడ్డి, దుర్గా నాయక్, సిద్ధ రాములు, బాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బడిబాట

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని పిఎం శ్రీ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామోజీపల్లి, వీరోజిపల్లి, ఉత్తులూరు గ్రామాలలో పర్యటించి తమ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి తల్లితండ్రులను చైతన్యపరిచారు. పిల్లల భవిష్యత్తుకు విద్య ఎంతో అవసరమని వివరించారు. ప్రభుత్వం పాఠశాలలో కల్పిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫార్మ్, విజ్ఞాన యాత్రల గురించి వివరించి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. అలాగే చదువు మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలలు చేర్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు రాధిక, సిద్ధి రాములు, అశ్విని, ప్రసన్న, రమ్య పాల్గొన్నారు.

గ్రామాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి : ఎమ్మెల్యే

నర్సాపూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని అందించాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలం ఆవంచ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే సునీతరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పిల్లలకు బారసాల(తొట్టెల), అన్నప్రాసనం,గర్భిణీలకు సీమంతం చేపట్టారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం తరఫున మొబైల్ ఫోన్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం సునీతరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు అందించే ఆహార విషయంలో జాగ్రత్త వహిస్తూ సమతుల పౌష్టికాహారాలు కలిగిన ఆహారాలను తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారమైన ఆహారాన్ని తీసుకోకపోవడంతో అనారోగ్యం కలిగి సంపాదించిన ఆదాయంలో 40 శాతం వైద్యానికి ఖర్చు చేస్తున్నామని చెప్పారు. నాణ్యమైన పుష్టికరమైన ఆరోగ్యంవంతమైన ఆహారాన్ని అందించాలని అప్పుడే పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి అందంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంతేగాక అప్పుడే పుట్టిన పిల్లలకు ముర్రుపాలు తాగించాలని, అవి రోగనిరోధక శక్తిని పెంచుతాయన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ స్రవంతి కరుణాకర్, డీడబ్ల్యుఓ హేమా భార్గవి, డీఆర్డిఓ శ్రీనివాసరావు, ఏపీవో అంజిరెడ్డి, ఏపీఎం సంగమేశ్వర్, మెడికల్ ఆఫీసర్ రఘువరన్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సరళ కుమారి, కవిత, శివకుమారి, పంచాయితీ కార్యదర్శి మల్లేశం, వార్డు సభ్యులు కరీముద్దీన్, మహిపాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతరెడ్డి

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, సర్పంచ్ జంగం రేణుక అన్నారు. శుక్రవారం పట్టణంలోని పూసలగల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో అందుతున్న పథకాలను గర్భిణీలు, బాలింతలు చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 9 నుండి 23వ తేదీ వరకు పోషణ్ పక్వాడ పథకం ద్వారా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరళ. అనురాధ సుజాత ఏఎన్ఎంలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

కామారంతండాలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10,ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తుందని కామారం తండా సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్ నాయక్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే ప్రత్యేక కోటాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని ప్రభుత్వం అందించే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని పొందాలన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యంమని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, వార్డు సభ్యులు, తండా వాసులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బిసి-డి నుంచి బిసి-ఏలోకి మార్చండి

అల్లాదుర్గం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: ముదిరాజ్‌లను బిసి–డి నుంచి బిసి–ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు కనకంటి భూమయ్య ప్రధాన కార్యదర్శి బదిన బేతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్‌ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చలో అసెంబ్లికి వెళుతున్నవారిని అరెస్టు చేసి పోలీసు ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా ముదిరాజ్‌లకు న్యాయం చేసేలా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లి నిర్వహిస్తే అరెస్టు చేయడం పిరికిపందలచర్యగా వారు అభివర్ణించారు. ముదిరాజ్‌లను బిసి–డి నుంచి బిసి–ఏలోకి మార్చకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు భాదేనా బేతయ్య, బుచ్చయ్య, దొంత లక్ష్మయ్య, బోయిన సత్తయ్య, కళాయి శ్రీనివాస్, మురారి చిన్న రాములు, బోయిని బాగయ్య, కాటి లక్ష్మణ్, బోయిని బేతాయ పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో ముదిరాజ్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

మాట్లాడుతూ డిఆర్‌డివో శ్రీనివాసరావు

మహిళా సంఘాలు బ్యాంకు రుణాలను చెల్లించాలి
డిఆర్‌డిఓ శ్రీనివాసరావు

నర్సాపూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : మహిళా సంఘాల ద్వారా బ్యాంకు నుంచి పొందిన అప్పులు శ్రీనిధి రుణాలు తిరిగి సకాలంలో చెల్లించాలని డిఆర్‌డిఓ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన అవంచ గ్రామ సంఘాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా నిర్మాణంలో ఉన్న గ్రామ సంఘం భవనాన్ని పరిశీలించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ సంఘాలు పొదుపును పెంచాలని తీసుకున్న బ్యాంకు అప్పులు, శ్రీనిధి అప్పులు తిరిగి చెల్లించాలని సూచించారు. అంతేగాక సంఘాలు గ్రామ సంఘాలు కట్టుబాట్లు పాటించాలని తెలిపారు.గర్భిణీ స్త్రీల పౌష్టికాహారం, పిల్లల పోషణ, ఆరోగ్యము పరిశుభ్రం గురించి క్లుప్తంగా వివరించారు. ఈ మేరకు సంఘంలోని ప్రతి సభ్యురాలు ఏదో ఒక పని చేస్తూ జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎం సంగమేశ్వర్ సీసీ రవీందర్ వివో ఏ మల్లేశ్వరి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో సమస్యలు రాకూడదు

సర్పంచ్‌లతో సమావేశమై మాట్లాడుతున్న అధికారులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామాల్లో వేసవి కాలంలో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లతో శుక్రవారం అధికారులు ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. శుక్రవారం న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లతో ఇంచార్జి ఎంపిడిఓ నరేష్‌బాబు, ఆర్‌డబ్లుఎస్ ఏఈ అంగద్ కుమార్ ప్రత్యేకంగా సమావేశమై తాగునీటి సమస్య రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

సర్వే కోసం హౌస్ లిస్టింగ్ పక్కాగా చేపట్టాలి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10,ప్రభాతవార్త: ఇంటింటి సర్వే కోసం హౌస్ లిస్టింగ్ పక్కాగా చేపట్టాలని తాసిల్దార్ మాలతి అధికారులకు సూచించారు. జనగణనలో భాగంగా శుక్రవారం మండల పరిధి మాందాపూర్‌లో హౌస్ లిస్టింగ్ బ్లాక్ మ్యాపింగ్ను పరిశీలించారు. నిర్దేశిత సర్వే ప్రణాళికను అనుసరిస్తూ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లను క్షేత్రస్థాయిలో ల్యాండ్ మార్కులను పరిశీలించి వివరాల నమోదులను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఆర్ఐ రాజు, పంచాయతీ కార్యదర్శి కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కు మురళి మృతి సమాజానికి తీరని లోటు

నర్సాపూర్ ఏప్రిల్ 9, ప్రభాతవార్త : సాధన స్వచ్ఛంద సంస్థను స్థాపించి బాల కార్మిక వ్యవస్థ, నిరక్షరాస్యత నిర్మూలనకు కృషిచేసిన సాధన స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ చిక్కు మురళి మృతి సమాజానికి తీరని లోటని తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం వ్యవస్థాపకఅధ్యక్షుడు గుండం మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం చిక్కు మురళి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న గుండం మోహన్‌రెడ్డి బాలానగర్‌లోని సాధన స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఉంచిన చిక్కు మురళిమోహన్ పార్థివదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

యోగాతో ఆరోగ్యంపై అవగాహన

రామాయంపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపల్‌కార్యాలయంలో హోమియోపతి దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియోపతి, యోగాపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముందు హోమియోపతి పితామహుడు హెనెన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయుష్ యోగ శిక్షకులు మద్దెల భరత్ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, అధికారులకు యోగాసాధనపై అవగాహన కల్పించారు. ముందుగా ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, ధ్యానం చేయించడం ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని వివరించారు. ప్రాణాయామం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యానికి కలిగే లాభాలను తెలియజేస్తూ, దాన్ని సరిగ్గా ఎలా చేయాలో, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. అలాగే రోజువారీ జీవితంలో యోగాసనాల ప్రాముఖ్యతను వివరించి, కొన్ని ఆసనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేష్, చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, కొక్కు ప్రవీణ్, రవినాయక్, బైరం స్వప్న కుమార్, చౌదరి చరిత, పుట్టి సందీప్, శంకర్ గౌడ్, దేవుని రంజిత్, మద్దెల మాధవి రమేష్, దాకి శ్యామల స్వామి, మేనేజర్ రఘువరన్, వైద్య సిబ్బంది వెంకటేశం, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా తప్పనిసరి : తహసిల్దార్...

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 10,ప్రభాతవార్త: ప్రస్తుత పరిస్థితుల్లో మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు యోగా చేయాలని తహసీల్దార్ మాలతి తెలిపారు. శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక హెల్త్‌వీక్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మండల కార్యాలయాల సముదాయాల ముందు ఆదర్శ పాఠశాల యోగ శిక్షకురాలు ఎల్లవ్వ ఆధ్వర్యంలో మండల అధికారులతో యోగా చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఆర్ఐ రాజు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రామాయంపేటలో యోగా చేస్తున్న మున్సిపల్ పాలకవర్గం, అధికారులు

చిన్నశంకరంపేటలో యోగా చేస్తున్న తహసీల్దార్ మాలతి తదితరులు

పోలీసుల అదుపులో ముదిరాజ్ సంఘం నాయకులు

ముదిరాజ్ సంఘం నాయకుల ముందస్తు అరెస్ట్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: గాంధీభవన్ ముట్టడికి తరలి వెళ్లుతున్న ముదిరాజ్ సంఘం నాయకులను శుక్రవారం పెద్దశంకరంపేట పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజులను బీసీ ఏ చేర్చాలని, కోకాపేటలో 5 ఎకరాలలో ముదిరాజ్ భవన్‌ను నిర్మించాలని, చట్టసభల్లో ముదిరాజులకు వాటా ఇవ్వాలని, జనాభా ప్రతిపాదికన ముదిరాజులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో ముదిరాజ్ సంఘం నాయకులు పున్నయ్య, వెంకటేశం, రవి, సాయిలు,సాయిరాం, అంజయ్య, ఆయా గ్రామాల ముదిరాజ్ సంఘం బాధ్యులు ఉన్నారు.

కౌడిపల్లిలో

అరెస్టయిన ముదిరాజ్ సంఘ నాయకులు

కౌడిపల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: ముదిరాజ్ సంఘ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు నేడు అసెంబ్లీ ముట్టడికి కౌడిపల్లి నుండి ఎవరిని వెళ్లకుండా స్థానిక పోలీసులు ముందస్తు చర్యలో భాగంగా శుక్రవారం అరెస్టు చేసి, సొంత పూచికత్తు మీద సాయంత్రం విడిచిపెట్టారు. అరెస్టయినవారిలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మటూరి శాకయ్య, కౌడిపల్లి గ్రామ అధ్యక్షుడు భుజిరంపేట మల్లేశం, నాయకులు గౌడిచర్ల పాండు, మహేశ్, వార్డు సభ్యులు గౌడిచర్ల ప్రశాంత్, సంఘ సభ్యులు తదితరలు ఉన్నారు.

నేత్రపర్వంగా భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

ఝరాసంగం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మండల పరిధిలోని కక్కరవాడలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఆలయ శిఖ పూజాకార్యక్రమాలతో వార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభించి 10 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, 11.45 గంటలకు స్వామి వారి కళ్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఆలయానికి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అతిథులకు ఉత్సవ కమిటి బాధ్యులు శాలువాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయ కమిటీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపిపి హన్మంతరావుపాటిల్, శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌పాటిల్, ఆర్ఐ రామారావు, ఆలయ ధర్మకర్తలు, కాంగ్రెస్ నాయకులు ఉదయ్‌శంకర్‌పాటిల్, శ్రీకాంత్‌రెడ్డి, వీరన్న, నర్సింలు, దశరథ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం

చౌటకూరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి చేరుకున్నవారికి ఆయుర్వేదిక్ డాక్టర్ సబిత ఆధ్వర్యంలో చికిత్సలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సబిత మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, ఒత్తిడిలాంటి కారణాలతో ప్రజలు అనేక రకాల వ్యాదులకు గురవుతున్నారని, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఆయుర్వేదిక వైద్యాన్ని ఆశ్రయించి శాశ్వత పరిష్కారరం పొందాలని సూచించారు. ఫార్మసిస్ట్ నరసయ్య శిబిరానికి చేరుకున్న ప్రజలు చికిత్సలు అందుకునేందుకు తన వంతు సహకరించారు.

జిపివోపై దాడిని ఖండించిన జిల్లా కమిటీ

పుల్‌కల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: మెదక్ జిల్లాలోని కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామంలో గ్రామ పాలన అధికారి (జీపీవో)పై గిరిజనులు చేసిన దాడిని గ్రామపాలన అధికారుల అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా కమిటీ ఖండించింది. ఏప్రిల్ 9న గ్రామపాలన అధికారి భూపాల్ విధి నిర్వాహణలో భాగంగా భూమికి సంబంధించి క్షేత్రస్థాయి విచారణ చేసేందుకు గ్రామానికి చేరుకోగా కొందరు వ్యక్తులు భూపాల్ కంట్లో కారం చల్లి దాడికి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు.

20వ తేదీలోగా తైబజార్‌కు దరఖాస్తు చేసుకోండి

జోగిపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో తైబజార్, మేకల సంత, పశువుల సంత, కబేళాలకోసం ఈ నెల 20వరకు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ రవీందర్ ఒక ప్రకనటలో తెలిపారు. వీటికి వేలంపాట నిమిత్తం ఈ నెల 10వరకు అవకాశం ఇవ్వగా, ఎవరూ దరఖాస్తు చేయకపోవటంతో మరోసారి గడువు పెంచినట్లు ఆయన తెలిపారు.

గుడి నిర్మాణానికి విరాళం అందజేత

శివ్వంపేట, ఏప్రిల్ 10(ప్రభాతవార్త) : మండలంలోని భీమ్లాతండా, పాంబండ తండాలో నూతనంగా నిర్మిస్తున్న జగదాంబ సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి హైకోర్టు సీనియర్ న్యాయవాది, శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం శివకుమార్‌గౌడ్ రూ. 60 వేల విరాళం అందజేశారు. విరాళం అందజేసిన శివకుమార్‌గౌడ్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదుర్గనాయక్, బుచ్చనాయక్, మాజీ సర్పంచ్ చెన్నానాయక్, రమేష్ నాయక్, సురేష్‌నాయక్, తండా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలి
అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ క్రిష్ణారెడ్డి

జోగిపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను మున్సిపల్ ఛైర్మెన్ ఎస్.క్రిష్ణారెడ్డి, కౌన్సిలర్లు అందచేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మొత్తం 65 మందికి ప్రొసీడింగ్ పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడు సొంత ఇల్లు నిర్మించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఐదు లక్షలు అందచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొశికె రాజశేఖర్, పట్లూరి శివశేఖర్, మాజీ కౌన్సిలర్ కొరబోయిన నాగరాజు, ప్రదీప్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు గూడెం మల్లయ్య, పట్లోళ్ల ప్రవీన్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందచేస్తున్న మున్సిపల్ చైర్మన్ క్రిష్ణారెడ్డి